సాక్షి
కర్నూలు

శనివారం । 11 । మార్చి । 2023



భ్రామరికి ఊయలసేవ

శ్రీశైలంటెంపుల్: శ్రీభ్రమరాంబాదేవికి శుక్రవారం శాస్త్రోక్తంగా ఊయలసేవ నిర్వహించారు. లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చకులు సేవా సంకల్పాన్ని పఠించి సహస్రనామ పూజలు చేపట్టారు.



మత్తులోనే షికారు!

ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తూ కొందరు మద్యం మత్తులో వాహనాలను నడుపుతున్నారు. జరిమానాలు విధిస్తున్నా, జైలు శిక్ష ఖరారవుతున్నా వీరిలో మార్పు రావడం లేదు.

IIలో▸



కనిష్టం	19.7
గరిష్టం	36.7

న్యూస్‌రీల్

పెయ్యదూడల వృద్ధికి ఎద సూదులు



మాట్లాడుతున్న డాక్టర్ రాజశేఖర్

ఎమ్మిగనూరురూరల్: పెయ్యదూడల సంతతిని పెంచేందుకు ఎద సూదులు వేయించాలని రైతులకు ఉమ్మడి కర్నూలు జిల్లా పశుసంవర్ధకశాఖ ఈవో, డీఎల్‌డీఏ డాక్టర్ రాజశేఖర్ సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని పార్లపల్లి గ్రామంలో పశుసంవర్ధకశాఖ ఏడీ డాక్టర్ సుబ్రమణ్యాచారి ఆధ్వర్యంలో పెయ్యదూడల ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రాజశేఖర్ మాట్లాడుతూ ప్రభుత్వం సబ్సిడీపై ఎద సూదులను అందజేస్తోందని, వీటిని వేస్తే పెయ్య దూడలే పుడతాయని పేర్కొన్నారు. పశువులకు ఎద సూదులు వేయించిన రైతులకు ప్రోత్సాహక బహుమతులను అందచేశారు. కార్యక్రమంలో వీఏఎస్‌లు డాక్టర్ ఉషారాణి, నరేంద్రనాథ్, జేవీవో రహ్మత్‌బీ తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్‌కు 15న ఆఖరు



ఓటు హక్కును వినియోగించుకుంటున్న అధికారులు

కర్నూలు(సెంట్రల్): ఎమ్మెల్సీ ఎన్నికల విధుల్లో ఉన్న 38 మంది ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కు వినియోగించుకున్నట్లు నోడల్ అధికారి టి.నాగరాజు నాయుడు తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో పోస్టల్ బ్యాలెట్ వినియోగ సౌలభ్య కేంద్రంలో ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోస్టల్ బ్యాలెట్ కోసం ఫారం -12 ద్వారా 68మంది దరఖాస్తు చేసుకున్నారని, ఇందులో 38మంది శుక్రవారం ఓటు హక్కును వినియోగించుకున్నట్లు చెప్పారు. మిగిలిన 30మంది పోస్టల్ బ్యాలెట్‌ను పోస్టల్ ద్వారా గానీ, నేరుగా కానీ ఈనెల 15వ తేదీలోపు అనంతపురం ఆర్‌ఓ కార్యాలయంలో సమర్పించాలని ఆయన వెల్లడించారు.

ఏపీ ఖాదీ విలేజ్ ఇండస్ట్రీస్ బోర్డు డీడీగా హరికృష్ణ



కర్నూలు(అగ్రికల్చర్): ఆంధ్రప్రదేశ్ ఖాదీ విలేజ్ ఇండస్ట్రీస్ బోర్డు డిప్యూటీ డైరెక్టర్‌గా హరికృష్ణ నియమితులయ్యారు. ఈయన ప్రస్తుతం జిల్లా చేనేత, జౌళిశాఖ సహాయ సంచాలకులుగా పనిచేస్తున్నారు. ఇప్పటి వరకు డీడీగా పనిచేసిన అధికారి మెడికల్ లీవ్‌లో వెళ్లడంతో పూర్తి అదనపు బాధ్యతలతో హరికృష్ణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమల స్థాపనను ప్రోత్సహిస్తామన్నారు. 2022–23లో 82 పరిశ్రమలు స్థాపించాలనేది లక్ష్యం కాగా.. ఇప్పటి వరకు 47 మాత్రమే మంజూరు అయ్యాయన్నారు. సరీ్వస్, సేవా రంగంలో పరిశ్రమలు స్థాపించవచ్చని.. సబ్సిడీలు 25 నుంచి 35 శాతం వరకు ఉంటాయని పేర్కొన్నారు.

అరటి.. లాభాల్లో మేటి!

- మార్కెట్‌లో టన్ను ధర రూ.25 వేలపైనే
- సాగుపై ఆసక్తి చూపుతున్న రైతులు
- సబ్సిడీలు ఇచ్చి ప్రోత్సహిస్తున్న ఉద్యాన శాఖ

కరువు ప్రాంతమైన కర్నూలు జిల్లాలో అరటి సాగును రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. ఉద్యాన శాఖ ద్వారా సబ్సిడీలు ఇప్పిస్తోంది. ఉపాధి హామీ పథకం కింద వంద శాతం రాయితీ కల్పిస్తోంది. గత రెండేళ్లుగా మార్కెట్‌లో ధరలు ఆశాజనకంగా ఉండడంతో టిష్యూకల్చర్ అరటి సాగు చేసేందుకు రైతులు ఉత్సాహం చూపుతున్నారు.



సాగులో ఉన్న అరటి

కర్నూలు(అగ్రికల్చర్): అరటి సాగు రైతులకు లాభాలను తెచ్చి పెడుతోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా మార్కెట్‌లో మంచి ధరలు లభిస్తున్నాయి. కర్నూలు జిల్లాలో వెయ్యి ఎకరాల్లో అరటి సాగు చేస్తున్నారు. ఓర్వకల్లు మండలంలో సాగు ఎక్కువగా ఉంది. మిగిలిన మండలాల్లో ఇద్దరు, ముగ్గురు రైతులు మాత్రమే ఈ పంట పండిస్తున్నారు. గత ఏడాది ఇదే సమయంలో ధరలు పెరిగాయి. ఈ సారి కూడా క్వింటా రూ.25 వేలపైనే పలుకుతోంది. దీంతో రైతుల ఆలోచనల్లో మార్పు వస్తోంది. అరటి సాగు చేయాలనే అభిప్రాయానికి వస్తున్నారు. దీంతో వచ్చే ఏడాది అరటి సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం ఉంది.

పెట్టుబడి ఇలా..

ఎకరాకు 1200 మొక్కలు (టిష్యూ కల్చర్) చొప్పున రూ. 60 వేలు ఖర్చు చేసి నాటుతున్నారు. సాగు ఖర్చులు, మందులకు అంతా కలిపి ఎకరాకు మరో రూ. 40 వేల నుంచి రూ. 50 వేల వరకు ఖర్చు అవుతుంది. కౌలు రైతుకు అయితే మరో రూ. 30 వేలు ఖర్చు అవుతుంది. 1200 మొక్కల్లో కనీసం 900 నుంచి 1000 చెట్లు గెలలు తెగినా సరాసరి 30 నుంచి 40 టన్నుల దిగుబడి వస్తుంది.

దిగుబడులు ఇలా..

ఓర్వకల్లు మండలంలో సుగంధాల అరటి ఎక్కువగా సాగు చేస్తున్నారు. కాయల సైజు చిన్నగా ఉండి గెల గరిష్టంగా 18 కిలోల వరకు వస్తుంది. ప్రస్తుతం మార్కెట్‌లో టన్ను ధర రూ.15 వేల వరకు పలుకుతోంది. డిమాండ్ లేని సందర్భంలో టన్నుకు రూ.6 వేల నుంచి 8 వేల వరకు ఇచ్చి కొనుగోలు చేస్తున్నారు. టిష్యూకల్చర్ అరటి జిల్లాలో పలు చోట్ల సాగు చేస్తున్నారు. ఈ రకం గెల సైజు ఎక్కువగా ఉండి, గరిష్టంగా 30 కిలోల వరకు వస్తుంది. మామూలుగా అయితే టన్ను రూ.10 వేలు ఉండేది. ప్రస్తుతం రూ.25వేలకు పైగా పలుకుతోంది. రీటైల్‌గా డజన్ అరటి నాణ్యత కలిగినవి రూ.60 వరకు అమ్ముతున్నారు. చిన్న సైజు అరటి డజను రూ.30 ప్రకారం అమ్మకాలు సాగిస్తున్నారు. తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాలతో పాటు కృష్ణా, ఉభయ గోదావరి జిల్లాల్లో అరటి దిగుబడులు లేకపోవడంతో ప్రస్తుతం రాయలసీమ అరటి గెలలకు మంచి డిమాండ్ ఏర్పడింది. ధరలు ఆశాజనకంగా ఉన్న నేపథ్యంలో టిష్యూ కల్చర్ అరటి సాగుపై రైతులు దృష్టి సారిస్తున్నారు. దీంతో పలు కంపెనీలు మొక్కలు ధరలు పెంచాయి.

ప్రోత్సాహకాలు ఇవీ..

ఉద్యాన పంటలకు ప్రభుత్వం ఆర్థిక చేయూతనందిస్తోంది. టిష్యూ కల్చర్ మొక్కలతో పాటు మైక్రో ఇరిగేషన్, సమగ్ర సస్యరక్షణ (ఐఎస్ఎం), సమగ్ర ఎరువులు, పురుగుల మందుల యాజమాన్యం (ఐపీఎం), ఫ్రూట్ కేర్ యాక్టివిటీ వరకు ఒక్కో రైతుకు గరిష్టంగా హెక్టారుకు రూ. 40 వేల వరకు ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో సాయం అందజేస్తోంది. దీంతో పాటు పంట సాగులో శిక్షణ ఇవ్వడం, అరటి సాగుచేసే ప్రతి రైతుకు గుడ్ అగ్రికల్చర్ ప్రాక్టీసెస్ సర్టిఫికేషన్ (జీఏపీ) ఇస్తుంది. కోతల అనంతరం నిర్వహణకు అవసరమైన ప్యాక్ హౌసెస్, కోల్డ్ స్టోరేజీలు, రైల్వేస్టేషన్లలో అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు అవసరమైన పెట్టుబడులు అందించడంతో పాటు బ్రాండింగ్, విదేశాల్లో ప్రమోషన్ వంటి కార్యకలాపాలకు తోడ్పాటు అందిస్తోంది. మరోవైపు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద 100 శాతం సబ్సిడీతో అరటి సాగుకు అవకాశం కల్పిస్తోంది. 5 ఎకరాలలోపు రైతులకు 90 శాతం సబ్సిడీపై డ్రిప్ సదుపాయం కల్పిస్తున్నారు.



నాణ్యత బాగా ఉంది



మార్కెట్‌లో టిష్యూకల్చర్ అరటికి మంచి డిమాండ్ ఉంది. ఈ రకం అరటి గెలల సైజు బాగా వస్తుంది. నాణ్యత బాగా ఉంటుంది. టిష్యూకల్చర్ అరటి సాగును ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. మంచి ధరలు ఉండడంతో అరటి సాగు చేయడంపై రైతులు దృష్టి సారిస్తున్నారు.

– పి.రామాంజనేయులు, జిల్లా ఉద్యాన అధికారి, కర్నూలు

గిట్టుబాటు ధరలు లభించాయి



మేం పండించిన అరటికి గరిష్టంగా టన్నుకు రూ.22వేలు ధర లభించింది. రూ.22వేల ధరతో 9 టన్నుల అరటి విక్రయించాం. రూ.16వేల ప్రకారం 30 టన్నులు, రూ.14వేల ప్రకారం 150 టన్నులు విక్రయించాం.సుగంధాల అరటికి గరిష్టంగా రూ.8వేల వరకు ధర లభిస్తుంది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ సారి గిట్టుబాటు ధరలు లభించాయి.

– గౌస్‌ఖాన్, కాల్వ గ్రామం, ఓర్వకల్లు మండలం

గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

- ఉమ్మడి కర్నూలు జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ ఐ.శ్రీదేవి

కర్నూలు(అర్బన్): జిల్లాలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలు/కళాశాలల్లో 5వ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం (ఆంగ్ల మాధ్యమం) ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యా సంస్థల జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ ఐ.శ్రీదేవి శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ప్రవేశ పరీక్ష ద్వారా విద్యార్థుల ఎంపిక జరుగుతుందని, అర్హులైన వారు తమ వివరాలను ఆన్‌లైన్‌లోని వెబ్‌సైట్http://apgpcet.apcfss.in,http://apgpcet.apcfss.in/interలో ఈ నెల 24వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు సమీపంలోని పాఠశాల/కళాశాల ప్రిన్సిపాల్‌ను సంప్రదించాలన్నారు. 5వ తరగతి ప్రవేశాలకు సంబంధించి ఏప్రిల్ 23న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు అదే రోజున మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు ప్రవేశ పరీక్షలు నిర్వహిస్తామన్నారు.

హెచ్3ఎన్2 వైరస్‌పై అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా అధికారులను ఆదేశించిన సీఎస్ డాక్టర్ జవహర్‌రెడ్డి

కర్నూలు(సెంట్రల్): జ్వరం, జలుబు లక్షణాలతో విజృంభిస్తున్న హెచ్3ఎన్2 వైరస్‌పై అప్రమత్తంగా ఉండాలని అధికారులకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జవహర్‌రెడ్డి సూచించారు. గురువారం ఆయన విజయవాడ నుంచి స్పందన అంశాలపై కలెక్టర్లుతో సమీక్షించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ..రాష్ట్రంలో వైరల్ ఫీవర్స్, వడదెబ్బ తదితర ప్రజారోగ్య అంశాలపై తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పిల్లలకు ఏదైనా జలుబుగాని, దగ్గుగాని, జ్వరంగాని వస్తే పాఠశాలలకు పంపొద్దని తల్లిదండ్రులకు సూచించారు. సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనలో భాగంగా బాలికలు, బాలింతలు, గర్భవతుల్లో రక్తహీనత నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం ఉచిత నిర్బంధ విద్యా హక్కు చట్టం–2009 అమలుపై అధికారులతో కలెక్టర్ కోటేశ్వరరావు సమీక్ష నిర్వహించారు.





కల్యాణం.. కమనీయం

కోడుమూరు మండలం గోరంట్ల గ్రామంలో శుక్రవారం తెల్లవారుజామున శ్రీలక్ష్మీ, భూదేవి, మాధవస్వామి కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. కల్యాణోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు.

– కోడుమూరు రూరల్

ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీదే గెలుపు

- కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం



ఆలూరు: పశ్చిమ రాయలసీమ పట్టభద్ర, ఉపాధ్యాయ, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానాలకు జరుగుతున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీదే గెలుపు అని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం గూళ్యం గ్రామంలో మంత్రి విలేకరులతో మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ, వలంటీర్ల వ్యవస్థను తీసుకొచ్చి రాష్ట్రంలో లక్షలాది మంది యువతీ, యువకులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఇచ్చారన్నారు. ఇటీవల విశాఖపట్నంలో జరిగిన పారిశ్రామికవేత్తల సదస్సు విజయవంతమైందని, రాష్ట్రానికి భారీగా పరిశ్రమలు రానున్నాయని తెలిపారు. యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉందన్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు పారదర్శకంగా అందుతున్నాయన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిచే అవకాశం లేకపోవడంతో టీడీపీ అడ్డదారులు తొక్కుతోందన్నారు. హామీలు అమలు చేయకుండా రాష్ట్రాన్ని అన్ని రకాలుగా భ్రష్టు పట్టించిన టీడీపీ అధినేత చంద్రబాబునాయుడిని ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు.

శ్రీశైలానికి కన్నడిగుల పాదయాత్ర



శ్రీశైలానికి పాదయాత్రగా వెళ్తున్న కన్నడ భక్తులు

హొళగుంద: కర్ణాటక రాష్ట్రానికి చెందిన కన్నడిగులు ఉగాది పండుగను పురస్కరించుకుని శుక్రవారం భారీ సంఖ్యలో శ్రీశైల మల్లన్న దర్శనానికి బయలుదేరారు. బళ్లారి జిల్లా శిరిగేరి, బాద్నట్టి, వద్దట్టి, కుడితిని, మణుసుగూరు, గెణికాళ్, సిద్దమ్మనళ్లి తదితర గ్రామాల నుంచి వందల సంఖ్యలో భక్తులు మల్లేశ్వరుని నామస్మరణంతో మండుటెండలో హొళగుంద మీదుగా పాదయాత్రతో తరలి వెళ్లారు. వీరికి హొళగుంద, సమ్మతగేరి, పెద్దహ్యాట, చిన్నహ్యాట, ఎల్లార్తి తదితర గ్రామస్తులు అల్పాహారం, భోజనంతో పాటు అరటి పండ్లు, మజ్జిగ ఇతర శీతల పానీయాలు అందజేశారు. మార్లమడికి రోడ్డులో హొళగుందకు చెందిన వారు ఆరోగ్య సమస్యలున్న భక్తులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

నేటి నుంచి సుయతీంద్రతీర్థుల మహా సమారాధన



సుయతీంద్రతీర్థుల మూల బృందావనం

మంత్రాలయం: శ్రీ రాఘవేంద్రస్వామి మఠం పూర్వపు పీఠాధిపతి సుయతీంద్రతీర్థుల మహాసమారాధన వేడుకలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు నేతృత్వంలో వేడుకలు మూడు రోజుల పాటు వైభవోపేతంగా నిర్వహించనున్నారు. శనివారం పూర్వారాధన, ఆదివారం మధ్యారాధన, సోమవారం ఉత్తరారాధన జరగనున్నాయి. మధ్యారాధన సందర్భంగా మహా పంచామృతాభిషేకం, బంగారు రథోత్సవం ఉంటాయి. వేడుకలకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వేలాదిగా తరలిరానున్నారు.

నెలాఖరులోగా ప్రాధాన్యత భవనాలు పూర్తి

కర్నూలు(అగ్రికల్చర్): రూఫ్‌లెవల్‌లో ఉన్న ప్రభుత్వ ప్రాధాన్యత భవనాల నిర్మాణాలను నెలాఖరులోగా పూర్తి చేస్తామని డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ అమరనాథరెడ్డి తెలిపారు. శుక్రవారం విజయవాడ నుంచి జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా గ్రామీణాభివృద్ధి, పంచాయతీ రాజ్ శాఖ కమిషనర్ కోన శశిధర్ సమీక్ష నిర్వహించారు. కాన్ఫరెన్స్‌లో అమరనాథరెడ్డి మాట్లాడుతూ.. ఈ నెల 13వ తేదీ నుంచి ఉపాధి పనులకు లక్ష మంది హాజరయ్యే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. కాన్ఫరెన్స్‌లో పంచాయతీ రాజ్ ఎస్ఈ సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

ష్..గప్‌చుప్!



- నేటితో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం పరిసమాప్తం
- సాయంత్రం నాలుగు గంటల తరువాత ప్రచారం చేస్తే చర్యలు
- మార్చి 13న ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్
- 107 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు..అందులో 56 సమస్యాత్మకమైనవిగా గుర్తింపు
- బ్యాలెట్ బాక్సులు..పేపర్లు సిద్ధం చేస్తున్న ఎన్నికల అధికారులు
- ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తే చర్యలు తప్పవని హెచ్చరిక

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు పోలింగ్‌కు 48 గంటల ముందే ప్రచారాన్ని నిలిపివేయాలి. శనివారం సాయంత్రం 4 గంటల తరువాత ఎలాంటి ప్రచారం చేయకూడదు. ప్రింట్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియా, సోషల్ మీడియాలు, ఇతరాత్ర ఏ విధమైన సాధనాల ద్వారా ప్రకటనలు గాని, బల్క్ ఎస్ఎంఎస్‌లుగాని పంపకూడదు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు.

– పి.కోటేశ్వరరావు, కలెక్టర్

కర్నూలు(సెంట్రల్): పశ్చిమ రాయలసీమ పట్టభద్ర, ఉపాధ్యాయ, కర్నూలు జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచార పర్వం శనివారం సాయంత్రం 4 గంటలకు ముగియనున్నది. ఆ తరువాత ప్రచారం చేస్తే ఎన్నికల నిబంధల మేరకు అధికారులు కేసులు నమోదు చేయనున్నారు. ఓటర్లు ప్రలోభాలకు గురికాకుండా పోలీసులతో ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేశారు. ఓటర్లకు బహుమతులు ఇవ్వడాన్ని, బంగారు ఆభరణాలు, డబ్బులు, చీరలు ఇవ్వడాన్ని, మద్యం, ఇతర మత్తు పానీయాలు ఇవ్వడాన్ని నేరంగా పరిగణిస్తారు. ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించేందుకు మార్చి 11, 12, 13 తేదీల్లో వైన్‌షాపులు, బార్లను మూసివేయాలని ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది.

పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్

పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోసం 74, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోసం 27, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల కోసం 6 చొప్పున మొత్తం 107 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో మంచి నీరు, నిరంతర విద్యుత్, కుర్చీలు, టేబుళ్లు, ఇతర మౌలిక వసతులను కల్పిస్తున్నారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకున్నా తెలుసుకునేందుకు వెబ్‌కాస్టింగ్‌ను ఏర్పాటు చేస్తున్నారు. పోలింగ్ కేంద్రాల నుంచి వెబ్‌కాస్టు లైవ్‌ను పరిశీలించేందుకు కలెక్టరేట్‌లో కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. ప్రతి పోలింగ్ కేంద్రానికి మైక్రో అబ్జర్వర్‌ను నియమించారు. మొత్తం 107 పోలింగ్ కేంద్రాల్లో 56 సమస్యాత్మకమైనవిగా గుర్తించారు. వీటిలో ప్రత్యేకంగా వీడియోగ్రఫీ చేయించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

బ్యాలెట్ బాక్సులు, పేపర్లు సిద్ధం...

ఎమ్మెల్సీ ఎన్నికలకు అవసరమైన బ్యాలెట్ బాక్సులను ఎన్నికల సంఘం సిద్ధం చేసింది. జిల్లాకు కొన్నింటిని హనుమకొండ నుంచి తెప్పించారు. ఇక గ్రాడ్యుయేట్, టీచర్ ఎమ్మెల్సీలకు సంబంధించి అనంతపురం నుంచి బ్యాలెట్ పేపర్లను అత్యంత భద్రత నడుమ జిల్లాకు తెప్పించారు. ఇప్పటికే బ్యాలెట్ బాక్సులు, పేపర్లు సంబంధిత డివిజన్ కార్యాలయాలకు చేరాయి. మార్చి 13వ తేదీ ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుంది.

క్లుప్తంగా

13 నుంచి 19 వరకు జిల్లా ట్రెజరీల్లో వార్షిక తనిఖీలు

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు, నంద్యాల జిల్లా ట్రెజరీల్లో ఈ నెల 13 నుంచి 19 వరకు వార్షిక తనిఖీలు నిర్వహించనున్నారు. ఇందుకు ఐదుగురు అధికారులతో ఒక బృందాన్ని ఏర్పాటు చేశారు. తనిఖీలను రాష్ట్ర ఖజానా, లెక్కల శాఖ డైరెక్టర్ మోహన్‌రావు పర్యవేక్షించనున్నారు. పీడీ ఖాతాల నిర్వహణ, పెన్షన్ పేమెంట్లు, జమలు, సీపీఎస్, జీపీఎఫ్, స్టాంగ్‌రూము తదితర వాటిని తనిఖీ చేస్తారు.

పోలింగ్‌లో పొరపాట్లకు తావివ్వొద్దు

కర్నూలు(సెంట్రల్): పొరపాట్లకు తావివ్వకుండా ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ నిర్వహించాలని నోడల్ అధికారులను కలెక్టర్ పి.కోటేశ్వరరావు ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పోలింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్‌లు, రిసెప్షన్ సెంటర్ల దగ్గర బందోబస్తును ఏర్పాటు చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. బ్యాలెట్ బాక్సులను అనంతపురం జేఎన్‌టీయూకు తరలించేందుకు తగిన భద్రతను కల్పించాలన్నారు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీకి సంబంధించి కౌంటింగ్ కేంద్రంలో సీసీ కెమెరాలు రాజకీయ పార్టీల ప్రతినిధుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేయాలన్నారు. డిస్ట్రిబ్యూషన్ సెంటర్లలో పోలింగ్ మెటీరియల్ పంపిణీ జాగ్రత్తగా జరగాలన్నారు. జంబో బ్యాలెట్ బాక్సులపై అనంతపురం ఆర్‌ఓ నుంచి వచ్చిన సూచనల ప్రకారం స్టిక్కర్లు అంటించాలన్నారు. బ్యాలెట్ బాక్సుల తరలింపు, పోలింగ్ సిబ్బందికి తగిన సంఖ్యలో వాహనాలు ఏర్పాటు చేయాలని డీడీసీ శ్రీధర్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్వో ఎస్వీ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ మిత్రకు 2,263 ఫిర్యాదులు

కర్నూలు: నగరంలో ఈనెల 4వ తేదీన ప్రారంభించిన ట్రాఫిక్ మిత్ర కార్యక్రమానికి ఇప్పటి వరకు 2,263 ఫిర్యాదులు వచ్చినట్లు ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫిర్యాదులను ట్రాఫిక్ విభాగం వారు పరిశీలించి ఉల్లంఘనకు పాల్పడినట్లు నిర్ధారించిన 113 మందికి రూ.59,390 జరిమానా విధించినట్లు పేర్కొన్నారు. కళాశాలలు, పాఠశాలల్లో విద్యార్థులకు కూడా ట్రాఫిక్ మిత్రపై అవగాహన కార్యక్రమం నిర్వహించాలని పోలీసులకు సూచించారు. త్రిపుల్ రైడింగ్, ర్యాష్ డ్రైవింగ్, రాంగ్ పార్కింగ్, మొబైల్ మాట్లాడుతూ వాహనం నడపడం, రాంగ్ రూట్ డ్రైవింగ్ వంటి ఉల్లంఘనులపై పోలీసు వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేస్తూ పోలీసులకు సహకరించాలని సూచించారు. ట్రాఫిక్ ఉల్లంఘనలపై ఫొటోలు, వివరాలు అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు.

మత్తులోనే షికారు!



➡ కర్నూలు బాలాజీ నగర్‌కు చెందిన మిత్ర బృందం వారి స్నేహితుడి పుట్టిన రోజు వేడుక జిల్లా సరిహద్దులోని అలంపూర్ గ్రామ శివారులోని ఓ గార్డెన్‌లో జరుపుకున్నారు. అనంతరం కర్నూలుకు బయలుదేరారు. వారు ప్రయాణిస్తున్న కారు తుంగభద్ర బ్రిడ్జి వద్ద రోడ్డు ప్రమాదానికి గురయ్యింది. వీరికి ఎదురుగా ఏ వాహనమూ అడ్డు రాలేదు. వేగంగా వెళ్లి బ్రిడ్జికి ఢీకొట్టారు. ఘటనా స్థలంలోనే ఒకరు మృతిచెందగా మరో నలుగురు గాయాలపాలయ్యారు. ఈ ప్రమాదానికి మద్యం మత్తులో వాహనం నడపటమే కారణమని పోలీసులు తేల్చారు.

➡ వెల్దుర్తికి చెందిన ఓ ఫొటోగ్రాఫర్ పెళ్లి వేడుకలకు సంబంధించిన ఫొటో ఆల్బమ్‌ను తయారు చేయించడానికి ద్విచక్ర వాహనంపై కర్నూలుకు వచ్చాడు. ఆల్బమ్ సిద్ధం చేయడానికి సమయం పడుతుందని ల్యాబ్ నిర్వాహకులు చెప్పడంతో స్నేహితులతో కలసి అలంపూర్‌కు వెళ్లి మద్యం సేవించి తిరిగి కర్నూలుకు వస్తూ తుంగభద్ర బ్రిడ్జి వద్ద రోడ్డు ప్రక్కనున్న ఇనుప రేలింగ్ (కమ్మి)ను ఢీకొట్టి అక్కడికక్కడే మృతిచెందగా స్నేహితుడు తీవ్ర గాయాలపాలయ్యాడు.

➡ ఇలా మద్యం మత్తులో వాహన చోదకులు రోడ్డెక్కుతున్నారు. పోలీసులు హెచ్చరిస్తున్నా బేఖాతర్ చేస్తున్నారు. తనిఖీల్లో పోలీసులకు చిక్కినవారికి జరిమానా విధిస్తున్నా, జైలు శిక్ష ఖరారవుతున్నా వాహనచోదకుల్లో మార్పు రావడం లేదు.

- మద్యం మత్తులో రోడ్డెక్కుతున్న వాహనదారులు
- జైలు శిక్షలు పడుతున్నా కనిపించని మార్పు
- మూడేళ్లలో 1,745 కేసులు నమోదు.. 1,559 మందికి జైలు శిక్ష

కర్నూలు : ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఏడు పోలీస్ సబ్ డివిజన్లు, 19 పోలీస్ సర్కిళ్లు, 78 పోలీస్ స్టేషన్లు ఉన్నాయి. డీఎస్పీ స్థాయి నుంచి సిబ్బంది వరకు నిత్యం గస్తీ నిర్వహిస్తూనే మరోవైపు వాహన తనిఖీలు చేపడుతున్నారు. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారిని బ్రీత్ ఎనలైజర్ ద్వారా పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఇలా పట్టుబడిన వారికి రూ.2 వేల వరకు జరిమానా, లేదంటే జైలు శిక్ష, కొందరికి రెండింటినీ కోర్టులు విధిస్తున్నాయి. రెండోసారి మద్యం తాగి వాహనం నడుపుతూ పోలీసులకు పట్టుబడితే వారం రోజుల పాటు జైలుపాలైన సంఘటనలు కూడా ఉన్నాయి. పోలీసులు, కోర్టులు కఠినంగా వ్యవహరిస్తున్నా మద్యం ప్రియుల్లో మార్పు రాకపోవడం గమనార్హం. ఇలాంటి వారి వల్ల ఉమ్మడి జిల్లాలో రోజుకు సగటున రెండు ప్రమాదాలు జరుగుతున్నట్లు పోలీసులు అంచనా వేస్తున్నారు.

కౌన్సెలింగ్‌తోనూ కనిపించని మార్పు...

జిల్లాలో మద్యం తాగి రోడ్డెక్కిన వారిలో కొందరు బాలలు (మైనర్లు) ఉంటున్నారు. ఇలాంటివారు పట్టుబడితే తల్లిదండ్రులను పిలిపించి స్టేషన్‌లో కౌన్సెలింగ్ ఇస్తున్నారు. మరోసారి ఇలా చేయవద్దంటూ హెచ్చరించి వదిలేస్తున్నారు. మత్తులో వాహనాలు నడిపితే ప్రమాదాలు జరుగుతున్న తీరు, వారి కుటుంబాలు ఇబ్బంది పడుతున్న దృష్టాంతాలను ఉదహరిస్తూ కౌన్సెలింగ్ ఇస్తున్నారు. ఇంత చేస్తున్నా తాగి రోడ్డెక్కే వారిలో పెద్దగా మార్పు కనిపించడం లేదని పోలీసులు చెబుతుండటం గమనార్హం. మూడేళ్లలో మద్యం తాగి వాహనాలతో రోడ్డెక్కినవారు 1,745 మంది పోలీసులకు చిక్కారు. వారి నుంచి రూ.21.48 లక్షలు జరిమానా వసూలయ్యింది. మద్యం తాగి పోలీసులకు చిక్కిన కేసుల్లో 1,559 మందికి కోర్టులు జైలు శిక్ష విధించాయి.

పోలీసులను చూసి పారిపోతూ ప్రమాదాలు...

డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడినవారు వేడుకలు, శుభకార్యాలు, ఇతర సాకులు చెబుతున్నారు. మరికొందరు పోలీసులను చూసి పరారవుతూ ప్రమాదాల బారిన పడిన సంఘటనలు ఉన్నాయి. 2019 సంవత్సరంలో అత్యధికంగా 1,313 డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు కాగా, అదే స్థాయిలోనే 1,204 మందికి జైలు శిక్ష పడింది. అలాగే రూ.14.28 లక్షల జరిమానా కూడా విధించారు. మద్యం తాగి పట్టుబడుతున్న వారిలో ఎక్కువ శాతం ద్విచక్ర వాహన, రవాణా రంగానికి చెందిన వారు ఉంటున్నారు. ఒకప్పటితో పోల్చితే కొంత మార్పు కనిపించినా కొత్తగా తాగి నడిపేవారి సంఖ్య పెరుగుతోందని పోలీసులు గుర్తించారు. కుటుంబ సభ్యులను దృష్టిలో పెట్టుకుని మద్యం తాగి వాహనాలు నడపడం మానుకోవాలి.



బ్రీత్ ఎనలైజర్ పరికరంతో డ్రంకెన్ డ్రైవ్ పరీక్ష నిర్వహిస్తున్న పోలీసులు

డ్రంకన్ డ్రైవ్ కేసుల వివరాలు..

సంవత్సరం	కేసులు	జరిమానా	జైలు శిక్షలు
2019	1,313	రూ.14,28,500	1,204
2020	-	-	-
2021	-	-	-
2022	116	రూ.2,21,100	109
2023	316	రూ.14,99,000	246

(2020, 2021లో కరోనా కారణంగా తనిఖీలు నిలిపేశారు)

అపరాధ రుసుం, జైలు శిక్ష...

గత ఏడాది 116 కేసుల్లో రూ.2.22 లక్షలు అపరాధ రుసుం వసూలు చేశారు. అలాగే 109 మందికి జైలు శిక్ష కూడా విధించారు. ఈ ఏడాది రెండు మాసాల వ్యవధిలోనే 316 కేసుల్లో రూ.14.99 లక్షలు జరిమానా వసూలు చేసి 246 మందికి జైలు శిక్ష వేశారు. మద్యం తాగిన వ్యక్తి నిర్ణీత పరిమితి దాటితే కేసు నమోదు చేస్తారు. వారిని కోర్టులో హాజరుపరచి అక్కడ అపరాధ రుసుం విధిస్తారు. తీవ్రతను బట్టి జైలు శిక్ష కూడా విధిస్తారు. కర్నూలులో ట్రాఫిక్ పోలీసులు డ్రంకెన్ డ్రైవ్ నిర్వహిస్తూ మద్యం తాగి రోడ్డు మీదకు వచ్చేవారి ఆట కట్టిస్తున్నారు.

> **మద్యం తాగి వాహనాలు నడపడం చట్టరీత్యా నేరం**
>
> 
>
> మద్యం తాగి వాహనాలు నడపడం చట్టరీత్యా నేరం. ప్రమాదానికి గురైతే కుటుంబీకులు ఇబ్బంది పడతారనే విషయాన్ని విస్మరించవద్దు. ప్రధానంగా యువత మద్యం మత్తులో వాహనాలు నడపడం, ప్రమాదాలకు గురవడం ఆందోళనకరం. చాలామందిలో మార్పు రావడం లేదు. వారి విలువైన భవిష్యత్తు నాశనం చేసుకోవద్దని సూచిస్తున్నాం.
>
> – నాగభూషణం, ట్రాఫిక్ డీఎస్పీ, కర్నూలు

వివాహం రద్దు అయ్యిందని..

మిడుతూరు: నాగలూటి గ్రామానికి చెందిన ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్‌ఐ మారుతీశంకర్ తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన షేక్ అక్బర్ బాషా (22)కు కోడుమూరు మండలం అమడగుంట్ల గ్రామంలో ఓ యువతితో వివాహం నిశ్చయమైంది. కాగా అక్బర్ బాషా జులాయిగా తిరుగుతున్నాడని యువతి కుటుంబీకులు వివాహం రద్దు చేసుకున్నారు. దీంతో అక్బర్ బాషా మనస్తాపం చెంది గురువారం ఉదయం ఇంట్లోనే పురుగు మందు తాగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. కుటుంబీకులు కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ కోలుకోలేక అదే రోజు సాయంత్రం మృతి చెందాడు. మృతుడి తండ్రి మాబుసాహెబ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

తుంగభద్ర నదిలో భక్తురాలి మృతి



మృతి చెందిన మహదేవి

కౌతాళం: తుంగభద్ర నదిలో కర్ణాటక భక్తురాలు మృతి చెందింది. ఈ ఘటన శుక్రవారం కుంబళనూరు గ్రామం వద్ద చోటు చేసుకుంది. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీశైల మల్లన్నను దర్శించుకునేందుకు తోటి భక్తులతో కలిసి కర్ణాటక రాష్ట్రం బెళగావి జిల్లా హుక్కెరి నియోజకవర్గం హంచినాళ గ్రామానికి చెందిన మహదేవి (38) పాదయాత్రగా బయలుదేరారు. శుక్రవారం సాయంత్రం కౌతాళం మండలం కుంబళనూరు గ్రామం వద్ద ఉన్న తుంగభద్ర నదిని దాటుతూ లోతును గుర్తించడం తెలియక నలుగురు మహిళలు నీళ్లలో మునిగిపోయారు. గమనించిన స్థానికులు వారిలో ముగ్గురిని కాపాడారు. మహదేవిని నీళ్లలో నుంచి బయటకు తీసేలోపు మృతి చెందింది.

ఫ్లయింగ్ స్క్వాడ్ విస్తృత తనిఖీలు



చాగలమర్రి సమీపంలో తనిఖీలు నిర్వహిస్తున్న ఎన్నికల ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారులు

ఆళ్లగడ్డ: పట్టభద్రులు, ఉపాధ్యాయ శాసమండలి ఎన్నికల పోలింగ్ సమీపిస్తుండటంతో ఫ్లయింగ్ స్క్వాడ్‌లు రంగంలోకి దిగాయి. ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నాయి. ప్రధాన రహదారులలోనే కాకుండా అంతర్గత, గ్రామీణ రోడ్లలో సైతం కాపు కాస్తున్నారు. శుక్రవారం పోలీసులతో కలిసి ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి శ్రీనివాసులు రెడ్డి ఆధ్వర్యంలో ప్రతి వాహనాన్ని తనిఖీ చేశారు. కార్లు, బైక్‌లపై వెళ్తున్న వారిని ఆపి వారి దగ్గర ఉన్న లగేజీ బ్యాగులను బయటకు తీసి పరిశీలించారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

– ఇద్దరు అరెస్ట్



అక్రమ మద్యంతో పట్టుబడిన వ్యక్తులను అరెస్టు చూపుతున్న సెబ్ పోలీసులు

ఆలూరు రూరల్: అక్రమంగా నిల్వ ఉంచిన కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఆలూరు సెబ్ సీఐ ఎర్ర వెంకట్ తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక సెబ్ కార్యాలయంలో ఏర్పాటు చేసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గురువారం అర్ధరాత్రి విజయవాడ స్పెషల్ పార్టీ, సెబ్ పోలీసులతో కలిసి స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ సమీపంలో సోదాలు నిర్వహించామన్నారు. అక్రమంగా నిల్వచేసిన 50 బాక్సుల కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకుని చంద్రశేఖర్, వెంకటేశ్వర్లు అనే ఇద్దరిని అరెస్టు చేసినట్లు చెప్పారు. పట్టుబడిన మద్యం విలువ రూ.2 లక్షలు ఉంటుందని వెల్లడించారు. దాడులలో సెబ్ ఎస్‌ఐలు రాజశేఖర్, భీమప్ప పాల్గొన్నారు.

18, 19 తేదీల్లో ఇంటర్వ్యూలు

కర్నూలు (అగ్రికల్చర్): జిల్లా సహకార కేంద్ర బ్యాంకులో స్టాఫ్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి ఈనెల 18, 19 తేదీలలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. 18 స్టాఫ్ అసిస్టెంట్ల పోస్టుల భర్తీకి జిల్లా సహకార కేంద్ర బ్యాంకు గత ఏడాది నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ ఏడాది జనవరిలో ఆన్‌లైన్‌లో రాత పరీక్ష నిర్వహించింది. రాత పరీక్షలో మెరిట్ ప్రాతిపదికన ఒక పోస్టుకు నలుగురు ప్రకారం ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. ఇంటర్వ్యూ కాల్ లెటర్లను www. kurnooldccb. com వెబ్‌సైట్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని డీసీసీబీ సీఈఓ రామాంజనేయులు శుక్రవారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు.

విద్యార్థినికి తేలుకాటు

మిడుతూరు: పీరుసాహెబ్ పేట ప్రాథమిక పాఠశాలలో రెండో తరగతి చదువుతున్న గోదా రేణుక అనే విద్యార్థిని తేలుకాటుకు గురైంది. శుక్రవారం పాఠశాలలో ఉండగా షూలో ఉన్న తేలు కుట్టగా వెంటనే పాఠశాల ఉపాధ్యాయులు చికిత్స నిమిత్తం మిడుతూరు సామాజిక ఆరోగ్యకేంద్రంలో చేర్పించారు. డాక్టర్ తిరుపతి విద్యార్థిని ప్రాథమిక చికిత్స అందించి కర్నూలు ఆసుపత్రికి రెఫర్ చేశారు. ఎంఈఓ మౌలాలి ఆసుపత్రికి చేరుకుని విద్యార్థిని పరామర్శించారు.

ఆసుపత్రిలో ప్రసవాలను ప్రోత్సహించాలి



సచివాలయాల సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ పి.కోటేశ్వరరావు

కర్నూలు(టౌన్): ఇంటి వద్ద కాకుండా ఆసుపత్రుల్లో ప్రసవాలు జరిగే విధంగా గర్భిణులకు అవగాహన కల్పించాలని వార్డు సచివాలయాల సిబ్బందిని కలెక్టర్ పి. కోటేశ్వరరావు ఆదేశించారు. నగరంలోని చల్లా కాంపౌండ్ వీధి, ధర్మపేట వీధుల్లోని 121, 122వ వార్డు సచివాలయాలను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. హైరిస్క్ గర్భిణులను గుర్తించి ఆసుపత్రుల్లో సుఖ ప్రసవం జరిగేలా చర్యలు చేపట్టాలని సచివాలయ సిబ్బందికి సూచించారు. ఆరోగ్య శ్రీ పథకం ద్వారా వైద్యం చేయించుకున్న వారి వివరాలు సచివాలయాలకు పంపించాలని ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ రఘును ఆదేశించారు. సచివాలయాల్లో ఉద్యోగుల మూవ్‌మెంట్ రిజిష్టర్‌ను పరిశీలించారు.

వ్యవసాయ మార్కెట్ కమిటీ ధరలు

పంట	తక్కువ ధర	ఎక్కువ ధర
వేరుశెనగ	రూ. 3222	రూ. 7000
పొద్దుతిరుగుడు	రూ. 4569	రూ. 5319
ఆముదం	రూ. 2349	రూ. 6259
వాము	రూ. 2011	రూ. 21111
ఉల్లి	రూ. 589	రూ. 909
ఎండు మిర్చి	రూ. 1599	రూ. 40580
శనగలు	రూ. 4390	రూ. 4635
కందులు	రూ. 1600	రూ. 7969
మొక్కజొన్న	రూ. 1920	రూ. 2076
మినుములు	రూ. 2005	రూ. 6896

ఆటోలో బంగారు నగలు మాయం

కర్నూలు: కర్నూలు శివారులోని పుల్లారెడ్డి కాలేజీ నుంచి రైల్వేస్టేషన్‌కు ఆటోలో వెళ్లిన మహిళ పర్సులో ఉన్న బంగారు నగలు మాయమయ్యాయి. గుంటూరు జిల్లా ఉండవల్లికి చెందిన హరిత రాణి పుల్లారెడ్డి కళాశాలలో ప్రొఫెసర్ ఉద్యోగం కోసం శుక్రవారం హైదరాబాదు నుంచి కర్నూలుకు వచ్చారు. తిరిగి హైదరాబాదుకు వెళ్లేందుకు కాలేజీ వద్ద ఆటో ఎక్కి కర్నూలు రైల్వేస్టేషన్ వద్ద దిగి చూసుకోగా పర్సులో ఉన్న 4 తులాల బంగారు నగలు కనిపించలేదు. ప్రయాణ మార్గంలో తోటి ప్రయాణికులే చోరీకి పాల్పడినట్లు రెండవ పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

28న ధాక్ అదాలత్

కర్నూలు(రాజ్‌విహార్): పోస్టల్‌కు సంబంధించిన సమస్యలను పరిష్కరించేందుకు ఈ నెల 28వ తేదీన ధాక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కర్నూలు డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు తమ సమస్యలను ఈనెల 25 తేదీలోపు రాసి పాతబస్టాండ్ వద్ద ఉన్న తమ కార్యాలయానికి పంపించాలని సూచించారు.

ద్విచక్ర వాహన దొంగ అరెస్టు

కర్నూలు: కర్నూలు నగరం గాయత్రి ఎస్టేట్‌లో పార్క్ చేసి ఉంచిన ద్విచక్ర వాహనాన్ని చోరీ చేసి తప్పించుకుతిరుగుతున్న దొంగను మూడవ పట్టణ పోలీసులు అరెస్టు చేసి కటకటాలకు పంపారు. కొత్తపేటకు చెందిన నరసింహారావు యాక్టివా స్కూటీని గాయత్రి ఎస్టేట్‌లోని వ్యాపార దుకాణం ముందు 2020 ఆగస్టు 28న పార్క్ చేసి లోపలికి వెళ్లాడు. తిరిగి వచ్చేసరికి వాహనం కనిపించలేదు. దీంతో ఆయన మూడవ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు దొంగపై నిఘా వేసి పట్టుకున్నారు. ఆత్మకూరు మండలం కరివేన గ్రామానికి చెందిన విజయుడు దగ్గర చోరీకి గురైన స్కూటీని స్వాధీనం చేసుకున్నారు. అతనిని కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్‌కు ఆదేశించినట్లు పోలీసులు తెలిపారు.

సాహిత్యంతో సమాజంలో చైతన్యం

- వైఎస్సార్ నా స్టూడెంటే
- మూడేళ్ల పాటు విద్యను బోధించాను
- రచయిత డాక్టర్ కసిరెడ్డి వెంకటపతిరెడ్డి



పుస్తకాన్ని మిత్రులకు అందిస్తున్న డాక్టర్ కసిరెడ్డి వెంకటపతిరెడ్డి

మహానంది: సాహిత్యంతో సమాజంలో చైతన్యం వస్తుందని రాష్ట్ర డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి తండ్రి, రచయిత, విద్వాన్ డాక్టర్ కసిరెడ్డి వెంకటపతిరెడ్డి అన్నారు. బుక్కాపురం గ్రామంలోని మిత్రుడు కంచర్ల ఈశ్వరయ్య మనవరాలి వివాహ వేడుకకు శుక్రవారం ఆయన సతీమణి కేవీ సుబ్బలక్ష్మమ్మతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ రచనలతో సమాజంలోని చెడును పారదోలి మంచిని, విజ్ఞానాన్ని పెంచేందుకు తన వంతు కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఇప్పటి వరకు 12 పుస్తకాలు రచించినట్లు చెప్పారు. 14 భాషల్లో వచ్చిన జగత్ప్రభు శ్రీకృష్ణ వైభవం పుస్తకాన్ని తెలుగులో తానే అనువదించినట్లు తెలిపారు. తాను వైఎస్సార్ జిల్లా పులివెందులలోని జిల్లా పరిషత్ పాఠశాలలో మూడేళ్ల పాటు పనిచేశానని, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి తన విద్యార్థి అని, ఆయనకు ఏడు నుంచి తొమ్మిదో తరగతి వరకు పాఠాలు చెప్పానన్నారు. వైఎస్సార్ ముఖ్యమంత్రి అయిన తర్వాత తనను ఘనంగా సన్మానించిన మధుర స్మృతిని ఎప్పటికీ మరిచిపోలేనన్నారు. నిత్యం పేదల కోసం కష్టపడే వైఎస్సార్‌ను కోల్పోవడం ఎంతో కలిచి వేసిందన్నారు. కార్యక్రమంలో కంచర్ల సురేష్‌రెడ్డి, బోయపాటి జగన్నాథం, వేమూరి కేశవరావు పాల్గొన్నారు.

రమణీయం.. రంగనాథుడి రథోత్సవం



జన వాహిని మధ్య శ్రీరంగనాథుడి రథోత్సవం

- శాస్త్రోక్తంగా శ్రీవారి కల్యాణం
- తరలివచ్చిన భక్తజనం



ఉత్సవమూర్తులు

మద్దికెర: గోవింద నామస్మరణతో పెరవలి గ్రామం మార్మోగింది. గ్రామంలో శ్రీరంగనాథుడి స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా శుక్రవారం శ్రీరంగనాథుడి రథోత్సవం నిర్వహించారు. వేడుకకు భక్తజనం భారీగా తరలిరావడంతో ఆలయ పరిసర ప్రాంతాలు కిటకిటలాడాయి. ఉదయం స్వామి వారి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి అభిషేకం, సహస్ర అష్టోత్తర నామం కార్యక్రమాలు చేపట్టారు. పారా రామన్న కుమారులు పారా రామచంద్ర ప్రసాద్, పారా విశ్వనాథ్ కల్యాణ మండపానికి పుష్పాలంకరణ చేయించగా, నర్సప్ప ఆచారి మంగళ సూత్రం సమర్పించారు. తర్వాత వేద పండితులు వేద మంత్రాల సాక్షిగా శ్రీరంగనాథుడు, శ్రీదేవి, భూదేవిలకు కల్యాణోత్సవం జరిపించారు. సాయంత్రం వేద మంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాల నడుమ ఉత్సవమూర్తులను ప్రత్యేక పల్లకీలో ఊరేగించి రథంలో కొలువుంచారు. తర్వాత భక్తజనం మధ్య రథం ముందుకు సాగింది. ఈ వేడుకలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మద్దికెర పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఉత్సవాలకు గ్రామస్తులే గాకుండా ఇతర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు.

సాక్షి బిజినెస్
శనివారం
11-3-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
671	177
59,135	17,413

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	11,233	▽	105
డోజోన్స్	32,093	▽	161
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,748	▽	132
డాక్స్	15,428	▽	205
షాంఘై	3,230	▽	46
నికాయ్	28,144	▽	479

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (24 క్యారట్)	55,669	△	383
బంగారం (22 క్యారట్)	55,446	△	381
వెండి (కిలో)	61,791	▽	2

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	81.38	83.05
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	96.38	99.64
€	యూరో	ఎస్‌బీఐ	85.60	88.64
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	59.23	61.15
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	52.93	55.28
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	59.68	61.62
SAR	సౌదీ రియాల్	[illegible]	20.88	22.55
UAE D	యూఏఈ దిర్హామ్	[illegible]	21.44	23.23
¥	చైనా యువాన్	[illegible]	10.69	12.76

హెచ్‌యూఎల్ ఎండీగా రోహిత్ జావా

న్యూఢిల్లీ: ఎఫ్ఎంసీజీ దిగ్గజం హిందుస్తాన్ యూనిలీవర్ లిమిటెడ్ (హెచ్‌యూఎల్) నూతన ఎండీ, సీఈవోగా రోహిత్ జావా నియమితులయ్యారు. దశాబ్ద కాలంపాటు నాయకత్వం వహించి పదవీ



విరమణ చెందుతున్న సంజీవ్ మెహతా స్థానాన్ని ఆయన భర్తీ చేయనున్నారు. ప్రస్తుతం లండన్‌లో యూనిలీవర్ ట్రాన్స్‌ఫర్మేషన్ చీఫ్‌గా జావా ఉన్నారు. అయిదేళ్ల కాలానికిగాను ఎండీ, సీఈవోగా 2023 జూన్ 27న బాధ్యతలు స్వీకరిస్తారు. అలాగే ఈ ఏడాది ఏప్రిల్ 1న కంపెనీ శాశ్వత డైరెక్టర్‌గా హెచ్‌యూఎల్ బోర్డులో చేరనున్నారు. యూనిలీవర్ సౌత్ ఏషియా ప్రెసిడెంట్‌గానూ ఆసీనులు కానున్నారు.

సెమీకండక్టర్ల రంగంలో మరింత సహకారం

భారత్, అమెరికా మధ్య ఎంవోయూ

న్యూఢిల్లీ: సెమీకండక్టర్ల రంగంలో సహకారాన్ని మరింత పెంచుకునే దిశగా భారత్, అమెరికా శుక్రవారం ఒక అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చుకున్నాయి. భారత్–అమెరికా వాణిజ్య చర్చల్లో భాగంగా కుదుర్చుకున్న ఈ ఒప్పందం.. సెమీకండక్టర్ల సరఫరా వ్యవస్థ ఏర్పాటు, ఆవిష్కరణల అంశాల్లో కలిసి పనిచేసేందుకు తోడ్పడనుంది. దాదాపు మూడేళ్ల విరామం తర్వాత ఈ చర్చలు జరిగాయి. ద్వైపాక్షిక వాణిజ్యం, పెట్టుబడులపరమైన సంబంధాలను మెరుగుపర్చుకునే మార్గాలపై ఈ సమావేశంలో కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్, అమెరికా వాణిజ్య మంత్రి జినా రైమొండో చర్చించారు. ఎలక్ట్రానిక్స్ సరఫరా వ్యవస్థలో కీలకంగా ఎదగాలన్న భారత్ ఆకాంక్షలకు ఈ ఎంవోయూ ద్వారా తోడ్పాటు లభించగలదని అమెరికా భావిస్తున్నట్లు రైమొండో తెలిపారు. పటిష్టమైన సరఫరా వ్యవస్థలను ఏర్పాటు చేసుకునేందుకు, పరస్పర సహకారాన్ని పెంపొందించుకునేందుకు ఇది ఉపయోగపడగలదని గోయల్ వివరించారు.



సంయుక్త విలేకరుల సమావేశంలో భారత్ అమెరికా వాణిజ్య మంత్రులు

పారిశ్రామిక ఉత్పత్తి ఓకే!

- జనవరిలో ఐఐపీ 5.2 శాతం అప్
- విద్యుత్, తయారీలు బాగున్నాయ్

న్యూఢిల్లీ: భారత్ పారిశ్రామిక ఉత్పత్తి 2023 జనవరిలో మంచి పనితీరును కనబరిచింది. ఇందుకు సంబంధించిన సూచీ (ఐఐపీ) 5.2 శాతం పెరిగింది. 2022 డిసెంబర్‌లో సూచీ పెరుగుదల రేటు 4.7 శాతంగా ఉంది. ఇక 2022 జనవరిలో ఐఐపీ వృద్ధి రేటు కేవలం 2 శాతం. జాతీయ గణాంకాల కార్యాలయం విడుదల చేసిన గణాంకాల ప్రకారం విద్యుత్, తయారీ రంగాలు చక్కటి పనితీరును ప్రదర్శించాయి.



రంగాల వారీగా ఉత్పత్తి గణాంకాలు (శాతాల్లో)

	2023 జనవరి	2022 డిసెంబర్
తయారీ	3.7	2.6
మైనింగ్	8.8	9.8
విద్యుత్	12.7	10.4
క్యాపిటల్ గూడ్స్	11.0	7.6
కన్జూమర్ డ్యూరబుల్స్	- 7.5	- 10.4
కన్జూమర్ నాన్ డ్యూరబుల్స్	6.2	7.2
ఇన్‌ఫ్రా/నిర్మాణం	8.1	8.2
ప్రైమరీ గూడ్స్	- 9.6	8.3
ఇంటర్మీడియట్ గూడ్స్	-0.1	-0.3

ఏప్రిల్ నుంచి జనవరి వరకూ ఆర్థిక సంవత్సరం 10 నెలల కాలంలో ఐఐపీ వృద్ధి రేటు 5.4 శాతంకాగా, 2021-22 ఇదే కాలంలో ఈ రేటు 13.7 శాతం.

అంబుజాలో అదానీ 4.5 శాతం వాటాల విక్రయం

న్యూఢిల్లీ: అనుబంధ సంస్థల్లో వాటాల విక్రయం ద్వారా గ్రూప్ రుణభారాన్ని తగ్గించుకోవడంపై అదానీ గ్రూప్ చీఫ్ గౌతమ్ అదానీ దృష్టి పెడుతున్నారు. ఇందులో భాగంగా అంబుజా సిమెంట్స్‌లో 4.5 శాతం వాటాను విక్రయించే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. దీని విలువ సుమారు 450 మిలియన్ డాలర్లుగా (దాదాపు రూ.3,380) ఉంటుందని సంబంధిత వర్గాలు తెలిపాయి. ఇందుకు సంబంధించి ఆర్థిక సంస్థలను కూడా సంప్రదించినట్లు పేర్కొన్నాయి. గతేడాది కొనుగోలు చేసిన అంబుజా సిమెంట్‌లో అదానీకి 63 శాతం వాటాలు ఉన్నాయి. ప్రస్తుతం అదానీ గ్రూప్ రుణ భారం దాదాపు 24 బిలియన్ డాలర్ల స్థాయిలో ఉంది. ఖాతాల్లో అవకతవకలు జరుగుతున్నాయంటూ అమెరికన్ షార్ట్ సెల్లింగ్ సంస్థ హిండెన్‌బర్గ్ రీసెర్చ్ ఆరోపణలతో గ్రూప్ కంపెనీల షేర్లు ఇటీవల భారీగా పతనమైన సంగతి తెలిసిందే. అయితే, మళ్లీ కొన్ని క్రమంగా కోలుకుంటున్నాయి.



కనెక్ట్ స్మార్ట్ సన్‌గ్లాసెస్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: కన్జూమర్ ఎలక్ట్రానిక్స్ కంపెనీ కనెక్ట్ గ్యాడ్జెట్స్ రిథమ్ పేరుతో బ్లూటూత్ కాలింగ్ స్మార్ట్ సన్‌గ్లాసెస్‌ను ఆవిష్కరించింది. ఎండ నుంచి రక్షణతోపాటు ఫోన్ కాల్స్ అందుకోవచ్చు. పాటలు వినొచ్చు. స్పెషల్ లాంచ్ ఆఫర్ ధర రూ. 1,999. నాలుగు గంటల ప్లేబ్యాక్ టైమ్ అందిస్తుంది. మార్కెట్లోకి విడుదల చేసిన 3 రోజుల్లోనే 20,000 యూనిట్లు విక్రయించామని కంపెనీ కో–ఫౌండర్ ప్రదీప్ యెర్రగుంట్ల తెలిపారు.



ఐపీవోకు టాటా టెక్నాలజీస్

దాదాపు రెండు దశాబ్దాల తర్వాత కార్పొరేట్ దిగ్గజం టాటా గ్రూప్ నుంచి మరో కంపెనీ పబ్లిక్ ఇష్యూ బాట పట్టింది. గ్లోబల్ ఇంజనీరింగ్ సర్వీసెస్ అందించే టాటా టెక్నాలజీస్ ఐపీవో సన్నాహాలు ప్రారంభించింది. సెబీకి తాజాగా ముసాయిదా ప్రాస్పెక్టస్‌ను దాఖలు చేసింది. ఆటో రంగ దిగ్గజం టాటా మోటార్స్‌కు ఇది అనుబంధ సంస్థకాగా.. ఇంతక్రితం ఐటీ సేవల నంబర్ వన్ కంపెనీ టీసీఎస్ 2004లో స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్టయ్యింది. ఐపీవోలో భాగంగా టాటా టెక్నాలజీస్ 9.57 కోట్ల ఈక్విటీ షేర్లను విక్రయానికి ఉంచనుంది.



గ్లోబల్ సర్ఫేసెస్ @ రూ. 133-140

నేచురల్ స్టోన్స్ ప్రాసెసింగ్, ఇంజనీర్డ్ క్వార్ట్జ్ తయారీ కంపెనీ గ్లోబల్ సర్ఫేసెస్ లిమిటెడ్ పబ్లిక్ ఇష్యూ సోమవారం(13న) ప్రారంభం కానుంది. బుధవారం (15న) ముగియనున్న ఇష్యూకి షేరుకి రూ. 133–140 ధరల శ్రేణిని కంపెనీ ప్రకటించింది. తద్వారా రూ. 155 కోట్లు సమీకరించే యోచనలో ఉంది. ఐపీవోలో భాగంగా 85.2 లక్షల షేర్లను తాజాగా జారీ చేయనుంది.



మార్కెట్లకు గ్లోబల్ షాక్

- రెండో రోజూ భారీ అమ్మకాలు
- సెన్సెక్స్ 671 పాయింట్లు డౌన్
- 59,135 వద్ద ముగింపు
- 177 నష్టంతో 17,413కు నిఫ్టీ



ముంబై: యూఎస్‌కు చెందిన ఎస్‌వీబీ ఫైనాన్షియల్ గ్రూప్ నిధుల సంక్షోభాన్ని ఎదుర్కోవడంతో ప్రపంచవ్యాప్తంగా సెంటిమెంటుకు దెబ్బ తగిలింది. దీంతో వరుసగా రెండో రోజు దేశీ స్టాక్ మార్కెట్లు పతనమయ్యాయి. సెన్సెక్స్ 671 పాయింట్లు కోల్పోయి 59,135 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 177 పాయింట్లు క్షీణించి 17,413 వద్ద నిలిచింది. రోజంతా అమ్మకాలదే పైచేయి కావడంతో మార్కెట్లు నష్టాల మధ్యే కదిలాయి. ఇంట్రాడేలో సెన్సెక్స్ 58,885ను తాకింది. ఒక్క రోజులోనే బీఎస్ఈ మార్కెట్ విలువలో రూ. 1.36 లక్షల కోట్లు ఆవిరైంది. రూ. 2,62,94,724 కోట్లకు చేరింది.

బ్యాంకింగ్‌కు దెబ్బ

అంచనాలకు మించి వడ్డీ రేట్లు పెరగవచ్చన్న యూఎస్ ఫెడ్ చైర్మన్ పావెల్ వ్యాఖ్యలు, ఎస్‌వీబీ ఫైనాన్షియల్ గ్రూప్‌పై ఆందోళనలు ఇన్వెస్టర్లలో భయాలకు కారణమయ్యాయి. దీంతో దేశీయంగా బ్యాంకింగ్ స్టాక్స్‌లో అమ్మకాలు ఊపందుకున్నాయి. ఎన్ఎస్ఈలో బ్యాంకింగ్, మీడియా, రియల్టీ, మెటల్, ఐటీ 2–1 శాతం నీరసించాయి. ఎఫ్ఎంసీజీ, కన్జూమర్ డ్యురబుల్స్ స్వల్పంగా బలపడ్డాయి. నిఫ్టీ దిగ్గజాలలో అదానీ ఎంటర్‌ప్రైజెస్, హెచ్‌డీఎఫ్‌సీ ద్వయం, అపోలో హాస్పిటల్స్, ఇండస్‌ఇండ్, ఎస్‌బీఐ, యాక్సిస్, బజాజ్ ఫిన్, ఎంఅండ్ఎం, ఐసీఐసీఐ, ఎల్అండ్‌టీఆర్ఐఎల్, కొటక్ బ్యాంక్ 3–1 శాతం మధ్య క్షీణించాయి. టాటా మోటార్స్, ఎన్‌టీపీసీ, మారుతీ, బ్రిటానియా, పవర్‌గ్రిడ్, టైటన్ 1–0.4 శాతం మధ్య బలపడ్డాయి.

మూతబడిన సిలికాన్ వ్యాలీ బ్యాంక్

న్యూయార్క్: ఇన్సూర్డ్ డిపాజిట్ల రక్షణకు వీలుగా ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్న సిలికాన్ వ్యాలీ బ్యాంక్(ఎస్‌వీబీ)ని మూసివేసినట్లు కాలిఫోర్నియా ఆర్థిక పరిరక్షణ శాఖ పేర్కొంది. అంతేకాకుండా ఫైనాన్షియల్ నియంత్రణ సంస్థ ఎఫ్‌డీఐసీ చేతికి అప్పగించినట్లు శుక్రవారం వెల్లడించింది. ప్రధానంగా సిలికాన్ వ్యాలీ, టెక్ స్టార్టప్‌లకు పెట్టుబడులు అందించే ఎస్‌వీబీ ఫైనాన్షియల్ గ్రూప్ ఆర్థిక సంక్షోభంలో పడింది. బ్యాంక్ పోర్ట్‌ఫోలియోలో భారీ నష్టాలు నమోదుకావడంతో నిధుల సమీకరణకు తెరతీసింది. బాండ్ల పోర్ట్‌ఫోలియోలో నష్టాలు నమోదు చేస్తున్న 21 బిలియన్ డాలర్ల(సుమారు రూ. 1,72,000 కోట్లు) విలువైన బాండ్లను విక్రయించినట్లు ఎస్‌వీబీ వెల్లడించింది. దీంతో 1.8 బిలియన్ డాలర్ల చిల్లు పడినట్లు తెలియజేసింది. ఫలితంగా బ్యాలన్స్‌షీట్ పటిష్టత కోసం 2.25 బిలియన్ డాలర్ల విలువైన షేర్లను విక్రయించనున్నట్లు తెలియజేసింది. ఈ నేపథ్యంలో నికర వడ్డీ ఆదాయం భారీగా క్షీణించవచ్చని బ్యాంక్ అంచనా వేసింది. యూఎస్ వెంచర్ క్యాపిటల్(వీసీ) దన్నున్న మొత్తం స్టార్టప్‌లలో సగానికిపైగా ఎస్‌వీబీ ఫైనాన్షియల్ సేవలందిస్తోంది. కస్టమర్లలో గతేడాది ఐపీవోకు వెళ్లిన 44 శాతం టెక్, హెల్త్‌కేర్ కంపెనీలుండటం గమనార్హం! జాబితాలో పింటెరెస్ట్ ఇంక్, షాపిఫై ఇంక్, సైబర్ సెక్యూరిటీ సంస్థ క్రౌడ్‌స్ట్రైక్ హోల్డింగ్స్ తదితరాలున్నాయి. వెరసి పలు వీసీ సంస్థలు ఎస్‌వీబీతో పోర్ట్‌ఫోలియో బిజినెస్‌లను తగ్గించుకోవడంతోపాటు నగదును వెనక్కి తీసుకునే యోచనలో పడినట్లు తెలుస్తోంది. దీంతో బ్యాంక్‌పట్ల విశ్వాసం ఉంచవలసిందిగా క్లయింట్లు, వీసీ ఇన్వెస్టర్లను ఎస్‌వీబీ సీఈవో గ్రెగ్ బెకర్ అభ్యర్థించారు.

బ్యాంక్ షేర్లకు సెగ

ఎస్‌వీబీ ఆర్థిక సంక్షోభ ఆందోళనలకుతోడు సిల్వర్‌గేట్ క్యాపిటల్ కార్ప్ మూతపడటంతో ఇన్వెస్టర్లలో భయాలు అధికమయ్యాయి. ఇటీవలే ఫెడ్ చైర్మన్ పావెల్ వడ్డీ రేట్ల పెంపు సంకేతాలివ్వడం దీనికి జత కలిసింది. ఫలితంగా గురువారం కేబీడబ్ల్యూ బ్యాంక్ ఇండెక్స్ 8% కుప్పకూలింది. యూఎస్ దిగ్గజాలు బ్యాంక్ ఆఫ్ అమెరికా, వెల్స్ ఫార్గో, జేపీ మోర్గాన్ షేర్లు 5%స్థాయిలో పతనమయ్యాయి.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

11-3-2023	
విశాఖ	430-00
చిత్తూరు	458-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	423-00
విజయవాడ	423-00
రిటైల్ ధర (డజను)	66.00
10-3-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	415-00
వరంగల్	417-00
రిటైల్ ధర	4.75

సాక్షి స్పోర్ట్స్

జర్మనీపై భారత్ విజయం

ఎఫ్ఐహెచ్ ప్రొ లీగ్ హాకీ టోర్నీలో భారత్ ఖాతాలో కీలక గెలుపు చేరింది. రూర్కెలాలో శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో భారత్ 3–2 గోల్స్ తేడాతో ప్రపంచ చాంపియన్ జర్మనీపై సంచలన విజయం సాధించింది. భారత్ తరఫున హర్మన్‌ప్రీత్ సింగ్ (30వ నిమిషం) పెనాల్టీ కార్నర్ ద్వారా గోల్ సాధించగా... సుఖ్‌జీత్ సింగ్ రెండు ఫీల్డ్ గోల్స్ (31వ ని., 42వ ని.) నమోదు చేశాడు. జర్మనీ నుంచి రెండూ ఫీల్డ్ గోల్స్ వచ్చాయి. 44వ నిమిషంలో కాఫ్‌మన్ పాల్ ఫిలిప్, 57వ నిమిషంలో స్ట్రతఆఫ్ మైకేల్ గోల్స్ కొట్టారు. మూడో క్వార్టర్ ముగిసే సరికి భారత్ 3–1తో ఆధిక్యంలో నిలిచినా... చివరి క్వార్టర్‌లో జర్మనీ గోల్ చేసి ఆధిక్యాన్ని తగ్గించగలిగింది. తమకు లభించిన ఏకైక పెనాల్టీని భారత్ సద్వినియోగం చేసుకోగలిగింది. భారత్ తమ తర్వాతి పోరులో ఆదివారం ఆస్ట్రేలియాతో తలపడుతుంది.



మన బ్యాటర్లపైనే భారం

- తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 36/0
- ఆస్ట్రేలియా 480 ఆలౌట్
- కామెరాన్ గ్రీన్ సెంచరీ



అశ్విన్

భారత్, ఆస్ట్రేలియా ఆఖరి టెస్టు పరుగుల బాట పట్టింది. గ్రీన్ శతకం సహాయంతో కంగారూలు భారీ స్కోరు నమోదు చేశారు. ఒక ఇన్నింగ్స్‌లో రెండు శతకాలు రావడం ఈ సిరీస్‌లో ఇదే మొదటిసారి. ఇక మన జట్టు ఎన్ని పరుగులు సాధిస్తుందనేది ఆసక్తికరం. ఆడిన పది ఓవర్లలో చక్కటి షాట్లతో ఎలాంటి ప్రమాదం లేకుండా రెండో రోజును ముగించిన టీమిండియా... మూడో రోజూ బ్యాటింగ్‌కు అనుకూలించే పిచ్‌పై చెలరేగాల్సి ఉంది.

అహ్మదాబాద్: ఈ సిరీస్‌లో స్పిన్ మాయలో, వికెట్ల వేటలో విజయవంతమైన బౌలర్లకు చివరి టెస్టు కఠినమైన సవాల్ విసురుతోంది. బ్యాటర్లకు స్వర్గధామంగా కనిపించిన మోదీ మైదానంలో రెండో రోజూ పరుగుల జోరు కొనసాగింది. అశ్విన్ (6/91) ఆరు వికెట్లతో ఆకట్టుకోగా... అప్పటికే పర్యాటక ఆసీస్ భారీ స్కోరు చేసింది. తొలి ఇన్నింగ్స్‌లో ఆస్ట్రేలియా 167.2 ఓవర్లలో 480 పరుగుల వద్ద ఆలౌటైంది. ఉస్మాన్ ఖాజా (422 బంతుల్లో 180; 21 ఫోర్లు) డబుల్ సెంచరీ అవకాశం కోల్పోగా, కామెరాన్ గ్రీన్ (170 బంతుల్లో 114; 18 ఫోర్లు) టెస్టు కెరీర్‌లో తొలి శతకం బాదాడు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ఆరంభించిన భారత్ పది ఓవర్లు ఆడి వికెట్ కోల్పోకుండా 36 పరుగులు చేసింది. కెప్టెన్ రోహిత్ శర్మ (17 బ్యాటింగ్; 2 ఫోర్లు), శుబ్‌మన్ గిల్ (18 బ్యాటింగ్; 1 ఫోర్, 1 సిక్స్) క్రీజులో ఉన్నారు.

ద్విశతక భాగస్వామ్యం...

రెండో రోజు తొలి సెషన్‌లో కూడా ఆస్ట్రేలియా ఆధిపత్యమే కొనసాగింది. 255/4 ఓవర్‌నైట్ స్కోరుతో ఆట కొనసాగించిన ఉస్మాన్ ఖాజా– గ్రీన్ జోడీ భారత బౌలింగ్‌పై పైచేయి సాధించింది. దీంతో జట్టు స్కోరు 300 పరుగులు దాటింది. లంచ్ బ్రేక్‌కు ముందే ఖాజా 150 మార్క్‌ను దాటగా, గ్రీన్ సెంచరీకి 5 పరుగుల దూరంలో నిలిచాడు. 347/4 స్కోరు వద్ద తొలి సెషన్ ముగియగా, రెండో సెషన్ మొదలైన కాసేపటికే గ్రీన్ టెస్టు కెరీర్‌లో తొలి సెంచరీని సాధించాడు. ఐదో వికెట్‌కు ఉస్మాన్ ఖాజా, గ్రీన్ 208 పరుగులు జోడించారు. 1979 తర్వాత భారత్ గడ్డపై ఆస్ట్రేలియా జోడీ నమోదు చేసిన ద్విశతక భాగస్వామ్యం ఇదే! ఆతిథ్య జట్టును అష్టకష్టాలు పెట్టిన ఈ జోడీని ఎట్టకేలకు అశ్విన్ విడగొట్టాడు. గ్రీన్‌ను అవుట్ చేయడంతో భారీ భాగస్వామ్యానికి తెరపడింది. అదే ఓవర్ ఆఖరి బంతికి క్యారీ (0)ని కూడా పెవిలియన్ చేర్చాడు. స్వల్ప వ్యవధిలో స్టార్క్ (6)ను అశ్విన్ బోల్తా కొట్టించాడు. మరోవైపు ఆస్ట్రేలియా ఈ పర్యటనలో తొలిసారి 400 పరుగుల మైలురాయిని చేరుకోగా, 409/7 వద్ద టీ విరామానికి వెళ్లారు.

విసిగించిన మర్ఫీ, లయన్

ఆఖరి సెషన్లో డబుల్ సెంచరీ దిశగా సాగుతున్న ఖాజాకు అక్షర్ పటేల్ చెక్ పెట్టాడు. ఇంకేం మిగతా రెండు వికెట్లను కూల్చేయడం సులభమే అనుకున్న భారత్‌కు టెయిలెండర్లు టాడ్ మర్ఫీ (61 బంతుల్లో 41; 5 ఫోర్లు), లయన్ (96 బంతుల్లో 34; 6 ఫోర్లు) చెమటలు పట్టించారు. ఇద్దరు 19.2 ఓవర్లు ఆడటంతో ఆతిథ్య బౌలర్లు శ్రమించక తప్పలేదు. బ్యాటింగ్‌కు కలిసొచ్చిన పిచ్‌పై ఈ స్పెషలిస్టు బౌలర్లు చక్కగా బ్యాటింగ్ చేశారు. వీలుచిక్కిన బంతిని బౌండరీలకు తరలించారు. ఇక ఒక దశలో 500 పరుగులు దాటిస్తారనిపించింది. వీరిద్దరు తొమ్మిదో వికెట్‌కు 70 పరుగులు జోడించారు. అయితే అశ్విన్ వరుస ఓవర్లలో మర్ఫీ, లయన్‌ను అవుట్ చేయడంతో ఆసీస్ ఆలౌటైంది.

స్కోరు వివరాలు

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్: హెడ్ (సి) జడేజా (బి) అశ్విన్ 32; ఖాజా (ఎల్బీ) (బి) అక్షర్ 180; లబుషేన్ (బి) షమీ 3; స్మిత్ (బి) జడేజా 38; హ్యాండ్స్‌కాంబ్ (బి) షమీ 17; గ్రీన్ (సి) భరత్ (బి) అశ్విన్ 114; క్యారీ (సి) అక్షర్ (బి) అశ్విన్ 0; స్టార్క్ (సి) అయ్యర్ (బి) అశ్విన్ 6; లయన్ (సి) కోహ్లి (బి) అశ్విన్ 34; మర్ఫీ (ఎల్బీ) (బి) అశ్విన్ 41; కునెమన్ నాటౌట్ 0; ఎక్స్‌ట్రాలు 15; **మొత్తం (167.2 ఓవర్లలో ఆలౌట్) 480. వికెట్ల పతనం:** 1-61, 2-72, 3-151, 4-170, 5-378, 6-378, 7-387, 8-409, 9-479, 10-480. **బౌలింగ్:** షమీ 31-3-134-2, ఉమేశ్ 25-2-105-0, అశ్విన్ 47.2-15-91-6, జడేజా 35-5-89-1, అక్షర్ 28-8-47-1, అయ్యర్ 1-0-2-0.

భారత్ తొలి ఇన్నింగ్స్: రోహిత్ బ్యాటింగ్ 17; గిల్ బ్యాటింగ్ 18; ఎక్స్‌ట్రాలు 1; **మొత్తం (10 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా) 36. బౌలింగ్:** స్టార్క్ 3-1-7-0, గ్రీన్ 2-0-11-0, లయన్ 3-0-14-0, కునెమన్ 2-0-3-0.



గ్రీన్

611 ఖాజా బ్యాటింగ్ చేసిన నిమిషాలు. భారత్‌లో ఒక ఆసీస్ బ్యాటర్ సుదీర్ఘ ఇన్నింగ్స్ ఇదే. ఆసీస్ తరఫున బంతులపరంగా (422) కూడా ఖాజాదే రికార్డు. గతంలో ముగ్గురు విదేశీ ఆటగాళ్లు (యూనిస్‌ఖాన్, ఆమ్లా, జయవర్ధనే) మాత్రమే భారత్‌లో 10 గంటలకు పైగా బ్యాటింగ్ చేయగలిగారు.

32 ఇన్నింగ్స్‌లో అశ్విన్ 5 వికెట్లు పడగొట్టడం ఇది 32వ సారి. భారత గడ్డపై కుంబ్లే (25 సార్లు) పేరిట ఉన్న రికార్డును అతను (26) అధిగమించాడు. ఆసీస్‌పై అత్యధిక వికెట్లు (113) తీసిన భారత బౌలర్‌గా కూడా కుంబ్లే (111) రికార్డును అశ్విన్ సవరించాడు.

కమిన్స్ ఇంట్లో విషాదం

సిడ్నీ: ఆస్ట్రేలియా టీమ్ రెగ్యులర్ కెప్టెన్ ప్యాట్ కమిన్స్ తల్లి మారియా కన్నుమూసింది. చాలా ఏళ్లుగా ఆమె క్యాన్సర్‌తో బాధపడుతోంది. అయితే రెండు వారాల క్రితం మారియా ఆరోగ్య పరిస్థితి మరింత విషమించింది. దాంతో తల్లిని చూసుకునేందుకు కమిన్స్ భారత్‌తో రెండో టెస్టు ముగిసిన తర్వాత స్వదేశం తిరిగి వెళ్లాడు. ఆమె కోలుకోక పోవడంతో అక్కడే ఉండిపోయాడు. మారియా మృతి పట్ల ఇరు దేశాల క్రికెట్ బోర్డులు సంతాపం ప్రకటించగా...ఆస్ట్రేలియా క్రికెటర్లు సంతాపసూచకంగా శుక్రవారం భుజాలకు నల్ల బ్యాండ్‌లు ధరించి మైదానంలోకి దిగారు.

బెంగళూరుకు నాలుగో ఓటమి

- 10 వికెట్లతో యూపీ జయభేరి
- చెలరేగిన ఎకిల్‌స్టోన్, హీలీ
- డబ్ల్యూపీఎల్

ముంబై: మహిళల ప్రీమియర్ లీగ్‌లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు పరాజయాల పరంపర కొనసాగుతోంది. ఇంకా బోణీకొట్టని బెంగళూరు వరుసగా నాలుగో మ్యాచ్‌లోనూ నిరాశపరిచింది. శుక్రవారం జరిగిన పోరులో అలీసా హీలీ (47 బంతుల్లో 96 నాటౌట్; 18 ఫోర్లు, 1 సిక్స్) బౌండరీల విధ్వంసంతో యూపీ వారియర్స్ 10 వికెట్ల తేడాతో జయభేరి మోగించింది. మొదట బ్యాటింగ్ చేపట్టిన బెంగళూరు 19.3 ఓవర్లలో 138 పరుగులకే ఆలౌటైంది. కెప్టెన్ స్మృతి మంధాన (4) నిరాశపర్చగా, సోఫీ డివైన్ (24 బంతుల్లో 36; 5 ఫోర్లు, 1 సిక్స్), ఎలీస్ పెర్రీ (39 బంతుల్లో 52; 6 ఫోర్లు, 1 సిక్స్) ధాటిగా ఆడారు. వీళ్లిద్దరు రెండో వికెట్‌కు 44 పరుగులు జత చేశారు. అయితే జట్టు స్కోరు 73 పరుగుల వద్ద సోఫీ అవుటయ్యాక పరిస్థితి మారింది. పెర్రీ క్రీజులో ఉన్నప్పటికీ అవతలి వైపు నిలబడే బ్యాటరే కరువయ్యారు. కనిక (8), హీథెర్ నైట్ (2), శ్రేయాంక (15), బరేస్ (12) ఇలా అంతా మూకుమ్మడిగా విఫలమయ్యారు. వారియర్స్ బౌలర్లలో సోఫీ ఎకిల్‌స్టోన్ 4, దీప్తి శర్మ 3 వికెట్లు తీశారు. అనంతరం లక్ష్యఛేదనకు దిగిన యూపీ 13 ఓవర్లలోనే వికెట్ నష్టపోకుండా 139 పరుగులు చేసి గెలిచింది. ఓపెనర్, కెప్టెన్ అలీసా హీలీ, దేవిక వైద్య (31 బంతుల్లో 36 నాటౌట్; 5 ఫోర్లు) ఇంకా 7 ఓవర్లు మిగిలుండగానే అజేయంగా ముగించారు.



హీలీ



ఎకిల్‌స్టోన్

డబ్ల్యూపీఎల్‌లో నేడు

గుజరాత్ జెయింట్స్ X ఢిల్లీ క్యాపిటల్స్

రాత్రి గం. 7:30 నుంచి

స్పోర్ట్స్ 18 చానెల్‌లో, జియో సినిమా యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

న్యూజిలాండ్ 162/5

క్రైస్ట్‌చర్చ్: శ్రీలంకతో జరుగుతున్న తొలి టెస్టులో న్యూజిలాండ్ కష్టాల్లో పడింది. మ్యాచ్ రెండో రోజు ఆట ముగిసే సమయానికి కివీస్ తమ తొలి ఇన్నింగ్స్ 5 వికెట్ల నష్టానికి 162 పరుగులు చేసింది. టామ్ లాథమ్ (67) అర్ధ సెంచరీ సాధించగా... డరైల్ మిచెల్ (40 బ్యాటింగ్), కాన్వే (30) రాణించారు. కుమార, అసిత చెరో 2 వికెట్లు పడగొట్టారు. అంతకు ముందు ఓవర్‌నైట్ స్కోరు 305/6తో ఆట కొనసాగించిన శ్రీలంక తొలి ఇన్నింగ్స్‌లో 355 పరుగులకు ఆలౌటైంది. సౌతీ 5, హెన్రీ 4 వికెట్లు తీశారు. ప్రస్తుతం కివీస్ మరో 193 పరుగులు వెనుకబడి ఉంది.

దక్షిణాఫ్రికా 287/7

జొహన్నెస్‌బర్గ్: వెస్టిండీస్‌తో జరుగుతున్న రెండో టెస్టులో మూడో రోజు ఆట ముగిసే సమయానికి దక్షిణాఫ్రికా తమ రెండో ఇన్నింగ్స్‌లో 7 వికెట్లు కోల్పోయి 287 పరుగులు చేసింది. కెప్టెన్ తెంబా బవుమా (275 బంతుల్లో 171 బ్యాటింగ్; 20 ఫోర్లు) భారీ సెంచరీతో చెలరేగగా...ముల్డర్ (42) రాణించాడు. 8 పరుగులకే 2 వికెట్లు కోల్పోయిన సఫారీ టీమ్‌ను బవుమా ఒంటి చేత్తో ఆదుకున్నాడు. బవుమా, ముల్డర్ ఆరో వికెట్‌కు 103 పరుగులు జోడించారు. విండీస్ బౌలర్లలో మేయర్స్, అల్జారి జోసెఫ్ చెరో 2 వికెట్లు తీశారు. ప్రస్తుతం దక్షిణాఫ్రికా ఓవరాల్‌గా 356 పరుగుల ఆధిక్యంలో ఉంది.